TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 59 | 11-07-2026 శనివారం | పేజీలు: 08 | వెల: 3/-

## ఓసీపీ3లో ఓబీ తరలింపులో భారీ కుంభకోణం








# సైబర్ సిటీలో భారీ ఎన్‌కౌంటర్

**గురుగ్రామ్‌లో పోలీసులకు, గ్యాంగ్‌స్టర్లకు మధ్య కాల్పులు**
**ఆపరేషన్‌లో నలుగురు కరుడుగట్టిన దుండగుల మృతి**
**మోస్ట్ వాంటెడ్ ముఠా గురిగా నిఘా వర్గాల అలర్ట్**
**పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు**
**లొంగిపోవాలన్న హెచ్చరికలు బేఖాతరు**
**పోలీసులపైకి నేరుగా కారు దూకించి కాల్పులు**
**నిర్మానుష్య ప్రాంతంలో చుట్టుముట్టిన పోలీసులు**
**అత్యాధునిక ఆయుధాలతో సవాల్ విసిరిన ముఠా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని ప్రముఖ ఐటీ కారిడార్, సైబర్ సిటీగా పేరొందిన గురుగ్రామ్‌లో శుక్రవారం తెల్లవారు జామున భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కరుడుగట్టిన అంతర్రాష్ట్ర గ్యాంగ్‌స్టర్లకు, గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు మధ్య జరిగిన ఈ హోరాహోరీ మిగతా 2లో..



# ప్రతిపక్షాల డ్రామాలను నమ్మే ప్రసక్తే లేదు



**బీఆర్ఎస్, బీజేపీలపై టీపీసీసీ చీఫ్ ఆగ్రహం**
**ఈ నెల 15న కార్పొరేషన్ పదవుల భర్తీపై తుది నిర్ణయం**
**హరీశ్ మంత్రిగా పదేళ్లు ఉండి ఏం చేశారు?**
**మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయంటూ ఎద్దేవా**
**హరీష్ రావు కాంగ్రెస్‌లోకి వస్తే కమిటీలో చర్చిస్తాం**
**రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు రేపుతున్న పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు**
**రీజినల్ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా వచ్చాయి?**
**కవిత ఆరోపణలపై విచారణకు డిమాండ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా రంజక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మిగతా 2లో..

# రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**చింతకానిలో రైతు ఆశీర్వాద మహాసభ..**
**సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం**
**భారీగా తరలివచ్చిన రైతులు, ప్రజలు**
**సీఎం రాకతో జేజేలు, నినాదాలతో**
**మార్మోగిన సభా ప్రాంగణం**
**కారు దిగి ప్రజల మధ్యకు వెళ్లిన రేవంత్ రెడ్డి**
**రైతులు, కార్యకర్తలకు ఆప్యాయంగా అభివాదం**
**సీఎంను చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు**
**ప్రజలతో మమేకమైన ముఖ్యమంత్రి తీరు ఆకట్టుకుంది**
**రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం**
**రైతుల ఆశీర్వాదంతో ముందుకు సాగుతామన్న సంకేతం**
**చింతకాని సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనీయబోమని తాను ఒట్టు పెట్టుకున్నానని, అందుకే 'పాపాల భైరవుడ్ని' ఫాంహౌస్‌లో బంధించామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాను ఆనాడే చెప్పానని, అందుకు తగ్గట్టుగానే అసెంబ్లీ, ఉప ఎన్నికల్లో కలిపి సీట్లు సాధించి అధికారంలోకి వచ్చామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు సున్నా సీట్లు వస్తాయని తాను చేవెళ్ల సభలో చెప్పిన మాట నిజమైందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో జరగబోయే పొలిటికల్ కురుక్షేత్రంలో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి.. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల ముచ్చటే లేదని, 2028 డిసెంబర్‌లో కాకుండా నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 25 పార్లమెంట్, 182 అసెంబ్లీ స్థానాలతో 2029 జూన్‌లోనే ఎన్నికలు జరుగుతాయని సీఎం స్పష్టం చేశారు.
కల్వకుంట్ల కుటుంబంలోనే అనేక కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, ఆ ఇంట్లో ఒకరిని చూస్తే ఒకరికి పడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. బావబావమరుదులైన హరీష్ రావు, కేటీఆర్‌లకు తండ్రి కేసీఆర్ రాజ్యం ఇవ్వడం లేదనే గిల్లికజ్జాలు, పోటాపోటీలు ఉన్నాయని, మిగతా 2లో..

# 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

**తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత**
**పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి**
**గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా మిగతా 2లో..



# ఆయిల్ పామ్ సాగుతోనే రైతులకు లాభాలు

**ప్రత్యామ్నాయ పంటలపై మంత్రులు**
**పొన్నం, వివేక్ కీలక ప్రకటన**
**ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే**
**గ్రామాలకు నిధులు**
**హుస్నాబాద్ నియోజకవర్గంలో**
**మెగా ప్లాంటేషన్**
**జనగామలో ఆయిల్ పామ్**
**మొక్కలు నాటిన మంత్రులు**
**ఐదు ఎకరాలపైన ఉన్న రైతులతో**
**ప్రత్యేక సమావేశాలు**
**డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి**
**సాధించడమే లక్ష్యమన్న పొన్నం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయ పంటలకు భిన్నంగా లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో శుక్రవారం నాడు భారీ ఎత్తున 'మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్' కార్యక్రమాన్ని మిగతా 2లో..

# క్రీడా రాజధానిగా భారత్

**2030 కామన్వెల్త్,**
**2036 ఒలింపిక్స్ ఆతిథ్యమే లక్ష్యం**
**మెల్‌బోర్న్ వేదికగా**
**ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన**
**భారత్‌లో ప్రపంచ**
**స్థాయి క్రీడల నిర్వహణ**
**మెల్‌బోర్న్ మైదానం నుంచి**
**ప్రధాని మోదీ కీలక ప్రసంగం**
**యంగ్ క్రికెటర్లతో ప్రధాని మోదీ**
**సరదా ముచ్చట్లు**
**ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్**
**స్టీవ్ వాతో ప్రత్యేక భేటీ**
**మెల్‌బోర్న్ స్టేడియంలో ప్రతి**
**భారతీయుడికీ ప్రత్యేక అనుభూతి**



**మెల్‌బోర్న్, (డిడి9 వార్త):**
భారతదేశాన్ని ప్రపంచ క్రీడా పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఆస్ట్రేలియా అధికారిక పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ మెల్‌బోర్న్ నగరంలో జరిగిన ఒక ప్రత్యేక క్రీడా కార్యక్రమంలో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. రాబోయే 2030 సంవత్సరంలో ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం అధికారికంగా ఆతిథ్యం మిగతా 2లో..

# రైతుల జీవితాలతో కాళేశ్వరం డ్రామాలు

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఈటల రాజేందర్ నిప్పులు**
**కరువులో మోటార్లు ఆన్ చేయకపోవడంపై ఆగ్రహం**
**రాజకీయాల కంటే నాకు తెలంగాణే ముఖ్యమన్న ఈటల**
**స్క్రిప్ట్ చదివే అలవాటు తనకు లేదంటూ కీలక వ్యాఖ్యలు**
**ఉత్తర తెలంగాణకు మిడ్ మానేరే ప్రధాన నీళ్ల జంక్షన్**
**ప్రాజెక్టుల మరమ్మతుల్లో జాప్యంపై తీవ్ర ధ్వజం**
**ఎగువన వర్షా లు పడుతున్నా ఎందుకు ఎత్తిపోయడం లేదు?**
**మేడిగడ్డలో ఉన్న నీటిని పంప్ చేయాలని డిమాండ్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ సమాజం, ఇక్కడి రైతాంగ ప్రయోజనాలే తనకు అత్యంత ప్రాధాన్యమని మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను తెలంగాణ మట్టిబిడ్డనని, ఉద్యమకారుడినని, అదే తన శాశ్వత గుర్తింపు అని పేర్కొన్నారు. తనకు ఎప్పుడైనా సరే మొదట తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని, ఆ తర్వాతే రాజకీయ పార్టీ అయినా, వ్యక్తిగత విషయాలైనా వస్తాయని తేల్చి చెప్పారు. రాజకీయ స్వార్థం కోసం ఎవరైనా రైతులను, ప్రజలను నష్టపరచాలని చూస్తే చూస్తూ ఊరుకోనని, చీల్చి చెండాడుతానని హెచ్చరించారు. తాము స్వయం ప్రకాశితులమని, ఎవరో వెనుక ఉండి మాట్లాడిస్తేనో, స్క్రిప్ట్ రాసి ఇస్తేనో మాట్లాడే నీచ సంస్కృతి తమకు లేదని, అలాంటి ఆరోపణలు చేసే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా తనకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.
రైల్వే వ్యవస్థకు కాజీపేట జంక్షన్ ఎంత కీలకమైనదో.. ఉత్తర తెలంగాణ సాగునీటి రంగానికి మిడ్ మానేరు డ్యామ్ అంతటి ప్రధాన నీళ్ల జంక్షన్ అని ఈటల రాజేందర్ అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఇంజనీరింగ్ నిర్మాణాలకు తక్షణమే మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తోందని ఆయన ప్రశ్నించారు. భవిష్యత్తులో భయంకరమైన కరువు పరిస్థితులు మిగతా 2లో..

# రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

వీరిద్దరూ చింతకాని సభ వద్ద ఆడుకోవాలంటూ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ సర్వేలు బ్యాండ్ మేళం వాయించినట్లుగా ఉన్నాయని, తలకాయలో చింతకాయంత మెదడు కూడా లేనివారే అలాంటి బోగస్ సర్వేలు నమ్ముతారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నింపాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై మండిపడుతూ.. "బుర్ర తక్కువ వాళ్లు.. మేడిగడ్డ తెగిపోయిన తరుణంలో అక్కడ నీళ్లు నింపితే భద్రాచలం రామాలయం మునిగిపోదా? మీ రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా?" అని ప్రశ్నించారు. అలాగే, తాము బీజేపీతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకోలేదని భద్రాచలం రాముడి మీద, మేనమామ కేసీఆర్ మీద ఒట్టేసి చెప్పే ధైర్యం హరీష్ రావుకు ఉందా అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు.

వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించడం అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ హక్కని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "కరెంట్ వైర్ అయినా పట్టుకోండి లేదా కల్వకుంట్ల కుటుంబాన్నైనా పట్టుకోండి.. కాకి మాదిరిగా నల్లగా మాసి మసి అవ్వడం ఖాయం" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్ల పాలనలో కేసీఆర్ నిరుద్యోగుల కలలను పూర్తిగా నరకప్రాయం చేశారని మండిపడ్డారు. ఖమ్మం రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ.. పువ్వాడ అజయ్ వంటి 'ఒంటికన్ను రాక్షసులు' చాలా మంది ఉన్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ (టీఆర్ఎస్)కు ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కవని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమి అత్యధిక స్థానాలు సాధిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

మొదటిపేజీ తరువాయి

బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

# సైబర్ సిటీలో భారీ ఎన్‌కౌంటర్


మొదటిపేజీ తరువాయి

కాల్పుల్లో నలుగురు దుండగులు అక్కడికక్కడే హతమయ్యారు. చీకటి విడిపోక ముందే జరిగిన ఈ ఆపరేషన్ స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సుదీర్ఘకాలంగా తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లను అడ్డుకునే క్రమంలో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పలు కీలక హత్యలు, భారీ దోపిడీలు, వసూళ్ల కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉంటూ పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న ఒక ప్రమాదకరమైన నేర ముఠా గురుగ్రామ్ సరిహద్దుల మీదుగా పారిపోయేందుకు ప్రయత్నిస్తోందని పోలీసు నిఘా వర్గాలకు ముందస్తుగా పక్కా సమాచారం అందింది. ఈ సమాచారంతో గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ ఉన్నతాధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. సదరు గ్యాంగ్‌స్టర్ల కదలికలపై నిఘా ఉంచి, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో సాయుధ పోలీసు బృందాలను రంగంలోకి దించారు.

క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నిర్దేశిత మార్గంలో పొంచి ఉండి, గ్యాంగ్‌స్టర్లు ప్రయాణిస్తున్న కారును గుర్తించి దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే, అక్కడ ఉన్నది పోలీసులని గమనించినప్పటికీ దుండగులు ఏమాత్రం భయపడలేదు. చట్టానికి లొంగిపోవడానికి బదులుగా, తమ కారును మరింత వేగంగా పోలీసుల వాహనాలపైకి దూకించే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా, కారు అద్దాలు దించి పోలీసులను లక్ష్యంగా చేసుకుని నేరుగా తుపాకులతో కాల్పులు జరపడం ప్రారంభించారు. గ్యాంగ్‌స్టర్లు కాల్పులు జరుపుతూ పారిపోతుండటంతో పోలీసులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా వారి వాహనాన్ని వేగంగా వెంటాడారు. సినిమా సీన్లను తలపించేలా సాగిన ఈ ఛేజింగ్ చివరకు నగర శివార్లలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి చేరుకుంది. అక్కడ దుండగుల కారును పోలీసులు అన్ని వైపుల నుంచి వ్యూహాత్మకంగా చుట్టుముట్టారు. చేతులు పైకెత్తి లొంగిపోవాలని పోలీసులు మెగాఫోన్ల ద్వారా గట్టిగా హెచ్చరించినప్పటికీ, గ్యాంగ్‌స్టర్లు తాము తెచ్చుకున్న అత్యాధునిక ఆటోమేటిక్ ఆయుధాలతో పోలీసులపైకి మరింత బలంగా ఎదురుకాల్పులకు తెగబడ్డారు.

ఇరువర్గాల మధ్య దాదాపు అర గంటకు పైగా సుదీర్ఘంగా మరియు హోరాహోరీగా తుపాకుల యుద్ధం సాగింది. గ్యాంగ్‌స్టర్లు పోలీసుల వైపు ఎడతెరిపి లేకుండా బుల్లెట్ల వర్షం కురిపించడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఆపరేషన్‌లో ఇరు పక్షాల మధ్య దాదాపు 60 రౌండ్లకు పైగా కాల్పులు జరిగినట్లు పోలీసు వర్గాలు ప్రాథమికంగా నిర్ధారించాయి. తెల్లవారుజామున ప్రశాంతంగా ఉన్న పరిసర ప్రాంతాల ప్రజలు ఈ బుల్లెట్ల శబ్దాలకు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. దుండగులు అత్యాధునిక ఆయుధాలతో ప్రాణాంతక దాడులు చేస్తున్న తరుణంలో, పోలీసులు తమ ప్రాణాలను కాపాడుకునేందుకు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు ప్రారంభించాల్సి వచ్చింది. క్రైమ్ బ్రాంచ్ బలగాలు క్షేత్రస్థాయిలో చూపిన సమయస్ఫూర్తి, వ్యూహాత్మక దాడుల వల్ల కారులోనే ఉన్న నలుగురు గ్యాంగ్‌స్టర్లు బుల్లెట్ గాయాలతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. కాల్పులు పూర్తిగా నిలిచిపోయిన తర్వాత పోలీసులు కారు వద్దకు వెళ్లి చూడగా నలుగురు నేరస్థులు మరణించి ఉన్నట్లు గుర్తించారు.

దుండగులు జరిపిన ఈ క్రూరమైన కాల్పుల్లో గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్రంగా బుల్లెట్ గాయాలయ్యాయి. గాయపడిన రక్షణ సిబ్బందిని తోటి పోలీసులు తక్షణమే చికిత్స నిమిత్తం సమీపంలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే, గాయపడిన వారిలో ఒక కానిస్టేబుల్ శరీరంలోకి బుల్లెట్లు బలంగా దూసుకుపోవడంతో ఆయన పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సరిహద్దు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ముగిసిన వెంటనే ఉన్నతాధికారులు అదనపు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు అక్కడ లభించిన ఆధారాలను సేకరించారు. గ్యాంగ్‌స్టర్ల కారు మరియు వారి వద్ద నుండి పెద్ద ఎత్తున అధునాతన ఆటోమేటిక్ రైఫిళ్లు, పిస్టళ్లు మరియు వందలాది లైవ్ బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హతమైన గ్యాంగ్‌స్టర్ల పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, ఈ అంతర్రాష్ట్ర నేర ముఠా వెనుక ఉన్న మిగతా నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పాతరేసేందుకు దర్యాప్తును ముమ్మరం చేశామని గురుగ్రామ్ పోలీస్ కమిషనరేట్ అధికారులు స్పష్టం చేశారు.



# ప్రతిపక్షాల డ్రామాలను నమ్మే ప్రసక్తే లేదు

మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో శుక్రవారం ఆయన అత్యవసర మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు బీఆర్ఎస్ నేతల అహంకారపూరిత వ్యాఖ్యలను, ఇటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు గుప్పించారు. "హరీష్ రావు గారు.. గత పదేళ్ల పాటు మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, మీరు కీలక శాఖలకు మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి ఏం చేశారో ముందు చెప్పండి. మీ హయాంలో నిర్మించిన ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులు నాణ్యతా లోపాలతో కుంగిపోయిన మాట వాస్తవం కాదా? దానికి సమాధానం చెప్పకుండా, ఇప్పుడు మా ప్రజా ప్రభుత్వానికి మళ్లీ మూడు నెలల సమయం ఇస్తామనడానికి మీరెవరు?" అని నిలదీశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వేగవంతమైన అభివృద్ధిని చూసి తట్టుకోలేక హరీష్ రావుకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

ఇదే సమయంలో మహేష్ కుమార్ గౌడ్ చేసిన ఒక వ్యాఖ్య ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఒకవేళ భవిష్యత్తులో హరీష్ రావు గారు తమ కాంగ్రెస్ పార్టీలోకి వస్తానని ప్రతిపాదన పెడితే లేదా ఆ దిశగా సంకేతాలు ఇస్తే.. తాము దాన్ని అంత తేలికగా తీసుకోమని చెప్పారు. తమ పార్టీలోని అత్యున్నత విభాగమైన 'పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ' లో దీనిపై విస్తృతంగా చర్చించి, సీనియర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఒక ఆసక్తికరమైన బాంబు పేల్చారు. ఈ వ్యాఖ్యలతో గులాబీ గూటిలో అంతర్గత ప్రకంపనలు మొదలయ్యాయి.

బీఆర్ఎస్ పార్టీకి అక్రమంగా చేరిన నిధుల అంశంపై మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత పార్టీ నిధులపై చేసిన ఆరోపణలలో ఖచ్చితంగా నిజం ఉందన్నారు. ఒక సాధారణ ప్రాంతీయ పార్టీ (రీజినల్ పార్టీ) కి ఏకంగా రూ.1,400 కోట్ల భారీ నిధులు ఏ విధంగా జమ అయ్యాయో గులాబీ నేతలు రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు చేరడం వెనుక క్విడ్ ప్రో కో, వివిధ కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన కమీషన్ల దందా దాగి ఉందనే బలమైన అనుమానాలు తమకు ఉన్నాయని, దీనిపై ఖచ్చితంగా లోతైన దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై కూడా పీసీసీ అధ్యక్షుడు నిప్పులు చెరిగారు. గత గులాబీ పాలనలో రాష్ట్రంలో భారీగా నీళ్ల దోపిడీ జరిగినప్పుడు, ప్రజల సొమ్ము ఇష్టారాజ్యంగా దుర్వినియోగం అయినప్పుడు ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌లోనే కీలక నేతగా, రాష్ట్ర ఆర్థిక మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆనాడు కళ్లముందే తప్పులు జరుగుతున్నా నోరు మెదపకుండా మౌనంగా ఉన్న ఈటల.. ఇప్పుడు బయటకు వచ్చి ఆనాటి దోపిడీ ప్రభుత్వానికి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో ఉంటూనే లోపాయికారీగా బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. గత 12 ఏండ్లుగా సాగుతున్న మోదీ నిరంకుశ పాలనను దేశ ప్రజలు చూస్తున్నారని, వారి తప్పుడు మాటలు నమ్మి ప్రజలు మళ్లీ గోతిలో పడరని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. "బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వచ్చినా.. మరెవరు వచ్చినా మాదొక్కటే సూటి ప్రశ్న. ఎన్నికల ముందు మీరిచ్చిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని నిలబెట్టుకున్నాకే మీరు ఈ తెలంగాణ గడ్డపై అడుగు పెట్టాలి" అని డిమాండ్ చేశారు. 12 ఏళ్ల పాలనలో నిరుద్యోగులను ముంచడం, సామాన్య ప్రజలపై ధరల భారం మోపడం మినహా బీజేపీ సాధించింది ఏమీ లేదని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై స్పందిస్తూ.. ఏ పెద్ద పార్టీలోనైనా చిన్న చిన్న సమస్యలు, భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అవన్నీ త్వరలోనే సామరస్యంగా తొలుతగిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణా కమిటీ అనేది సామాన్య కార్యకర్త నుంచి సీనియర్ నేతల వరకు అందరికీ సమానమేనని తేల్చిచెప్పారు. ఇటీవల చోటుచేసుకున్న కడియం శ్రీహరి, మంత్రి కొండ సురేఖ మరియు తుంగతుర్తి నియోజకవర్గ పంచాయతీ వ్యవహారాలపై విచారణ జరిపేందుకు ఇద్దరు సీనియర్ నాయకులు సచిన్ సావంత్, జగ్గారెడ్డిలను ప్రత్యేక అబ్జర్వర్లుగా నియమించినట్లు వెల్లడించారు. వారిద్దరూ క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్ర పరిశీలన చేసి ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసమే ఇతర పార్టీల ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇస్తున్నారని ఆయన సమర్థించుకున్నారు.

పార్టీ కోసం మొదటి నుంచి నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు, నాయకులకు త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని పీసీసీ చీఫ్ కీలక ప్రకటన చేశారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ (నామినేటెడ్) పదవుల భర్తీ ప్రక్రియపై ఆయన ఒక స్పష్టమైన అప్‌డేట్ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్లతో తాము ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. ఆ రోజే సుదీర్ఘంగా చర్చించి అర్హులైన వారితో కార్పొరేషన్ పదవులపై తుది నిర్ణయం తీసుకుని, జాబితాను అధికారికంగా విడుదల చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పాలన పట్ల జనాలు పూర్తి సంతృప్తితో ఉన్నారని, ఇతర పార్టీల తలుపుల వ్యవహారాలతో తమకు ఎలాంటి నష్టం లేదని మహేష్ కుమార్ గౌడ్ ముగించారు.

# రైతుల జీవితాలతో కాళేశ్వరం డ్రామాలు

మొదటిపేజీ తరువాయి

వస్తాయని ముందే తెలిసినప్పటికీ, ప్రభుత్వం ఇంత బాధ్యతారాహిత్యంగా ఎందుకు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాజకీయాల కోసం కాల్వల్లో నీళ్లు ఆపితే సహించేది లేదన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద ఉన్న భూములకు కేవలం బోర్లు, బావుల ద్వారా మాత్రమే పూర్తి స్థాయిలో వ్యవసాయం చేయడం అసాధ్యమనే కఠిన వాస్తవాన్ని సాగునీటిపై కనీస అవగాహన ఉన్నవారెవరైనా ఒప్పుకుంటారని చెప్పారు.



ప్రస్తుతం ఎగువ రాష్ట్రాలలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తెలంగాణలోని వివిధ ప్రాజెక్టుల్లోకి సహజంగానే వరద నీరు భారీగా వచ్చి చేరుతోందని ఈటల రాజేందర్ తెలిపారు. లోలెవల్ పాయింట్‌కు నీరు చేరుతున్నప్పటికీ, ప్రభుత్వం మోటార్లు ఆన్ చేసి ఆ నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని నిలదీశారు. తాము మేడిగడ్డ బ్యారేజీలో ప్రమాదకరంగా నీటిని పూర్తిగా నింపమని కోరడం లేదని, కనీసం అక్కడ అందుబాటులో ఉన్న నీటినైనా పంపుల ద్వారా ఎగువకు తరలించి ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులను నింపాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం పంటల సీజన్ ప్రారంభమైనా పొలాలకు నీళ్లు ఇవ్వకుండా అన్నదాతలను కష్టాల పాలు చేయడం ఏమాత్రం భావ్యం కాదన్నారు.

సాగునీటి సంక్షోభంతో పాటు రాజధాని నగరం హైదరాబాద్‌కు ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడిపై ఈటల రాజేందర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహానగరానికి అందాల్సిన నీటి పరిమాణంలో దాదాపు 107 ఎంజీడీల నీటి సరఫరా తక్కువగా ఉందని గణాంకాలతో సహా వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పుడే మేల్కొని జలాశయాలలో నీటి నిల్వలను పెంచకపోతే, రాబోయే రోజుల్లో నగరంలో తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడుతుందని హెచ్చరించారు. నీటి కొరత వస్తే సామాన్య ప్రజలు ఎటు పోవాలని, ఈ సమస్యకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. తాము ఏ ఒక్క పార్టీని వ్యక్తిగతంగా తిట్టడానికి రాలేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి పనులు చేయాల్సిన వారిని మాత్రమే ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు.

నీళ్ల కోసమే, నిధుల కోసమే, తెలంగాణ ఆత్మగౌరవం కోసమే కోట్లాది మంది ప్రజలు ఉద్యమించిన సుదీర్ఘ చరిత్ర మనకుందని ఈటల గుర్తుచేశారు. ఈనాడు రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనప్పటికీ స్వరాష్ట్ర జల మూలాలను మరిచిపోవడం దుర్మార్గమన్నారు. చాలా మంది నేతలు చరిత్రను పూర్తిగా విస్మరించి మాట్లాడుతున్నారని, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందే ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే 'జలయజ్ఞం' పేరిట ఈ ప్రాంతానికి నీటిని తెచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. జలయజ్ఞంలో భాగంగానే తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నది నీళ్లను తెలంగాణకు మళ్లించాలని తొలుత ప్లాన్ చేశారని, తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే 24 టీఎంసీల సామర్థ్యంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని చారిత్రక అంశాలను వివరించారు.

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ప్రాజెక్టుల పురోగతిని అడ్డుకోవడం సరికాదని ఈటల రాజేందర్ హితవు పలికారు. గతంలో దేవాదుల ఎత్తిపోతల పథకానికి ఎలాంటి శాశ్వత బ్యారేజీ లేకపోయినప్పటికీ, అందుబాటులో ఉన్న సాంకేతికతను వాడుకుని నది నుంచి విజయవంతంగా నీటిని పంపింగ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం విషయంలో కూడా సాంకేతిక సాకులు, నివేదికల పేరుతో కాలయాపన చేయడం ఆపాలని కోరారు. శ్రీపాద ఎల్లంపల్లి, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ద్వారా కాళేశ్వరం నీళ్లు చేవెళ్ల వరకు రావాలనే మొదటి ఆలోచన, పునాది వేసింది కాంగ్రెస్ పార్టీనే అనే విషయాన్ని నేటి ఆ పార్టీ నాయకులు మరిచిపోవద్దని హితవు పలికారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇక్కడి పొలాలకు కడుపునిండా నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించేలా మునుపటి ప్రభుత్వం ప్రాజెక్టులను అనుసంధానించిందని ఈటల పేర్కొన్నారు. ఆ వ్యవస్థ ద్వారా వచ్చిన 29 టీఎంసీల నీళ్లే నేడు మిడ్ మానేరులో నిల్వ ఉన్నాయని తెలిపారు. గతంలో పోచంపాడు (90 టీఎంసీలు), ఎల్ఎండీ (24 టీఎంసీలు) కెపాసిటీ ఉన్నప్పటికీ, హుజూరాబాద్ నియోజకవర్గంలో ఒక్క పంటకు కూడా సరిగ్గా నీళ్లు అందేవి కావన్నారు. తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎస్ఆర్ఎస్పీ నీళ్లు వచ్చిన వేళ తూములు ఎత్తించి రైతులకు హీరో అయ్యానని గుర్తుచేసుకున్నారు. కాళేశ్వరం లింక్ అయిన తర్వాతే మిడ్ మానేరు నిధులతో కరీంనగర్, హుజూరాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో సంపూర్ణంగా రెండు పంటలు పండుతున్న మాట పచ్చి నిజం కాదా అని ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన డిజైన్ల మార్పులు, కాంట్రాక్టులు, కమీషన్ల అవినీతి గురించి తాను మాట్లాడటం లేదని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవచ్చని ఈటల స్పష్టం చేశారు. అయితే, అసలు ఆ ప్రాజెక్టు కట్టడమే ఒక పెద్ద తప్పు అన్నట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడటం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రాజెక్టుపై కక్షతో సాగునీటి సరఫరాను నిలిపివేసి రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని 'ఖబర్దార్' అంటూ హెచ్చరించారు. గతంలో ఒకవేళ నీళ్లు వరంగల్ వాసులకు చేరకపోతే తనపై ఇక్కడి ప్రజలు చిందులు తొక్కేవారని, నీటి విలువ రైతులకు మాత్రమే తెలుస్తుందని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీలు కాళేశ్వరంపై ఆడుతున్న రాజకీయ డ్రామాలను పక్కనబెట్టి, అన్నదాతల పంటలను కాపాడటానికి తక్షణమే పంపింగ్ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# ఆయిల్ పామ్ సాగుతోనే రైతులకు లాభాలు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. ఈ విశిష్ట కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఇద్దరూ క్షేత్రస్థాయిలో స్వయంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటి ఈ సాగు విస్తరణ ఉద్యమాన్ని అధికారికంగా ప్రారంభించారు. మొక్కలు నాటిన అనంతరం నిర్వహించిన రైతు సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌కు తగ్గట్టుగా దేశంలో ఉత్పత్తి జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొరతను అధిగమించాలంటే రైతులు సాంప్రదాయ వరి సాగు నుంచి లాభసాటి ఆయిల్ పామ్ వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే తమ నియోజకవర్గ పరిధిలో ఐదు ఎకరాలు అంతకంటే ఎక్కువ భూమి ఉన్న ప్రతీ ఒక్క రైతుతో ప్రత్యేకంగా అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి, వారిని ఈ సాగు వైపు ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు అందివచ్చిన ఈ అవకాశాన్ని వాడుకుని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు.



జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును రికార్డు స్థాయిలో పెంచేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. జిల్లాలో మొత్తం 50 వేల ఎకరాలలో ఈ పంటను సాగు చేయాలనే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ప్రస్తుతం ఇప్పటికే 14 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగు విజయవంతంగా సాగుతోందని చెప్పారు. రైతులు పండించిన ఆయిల్ పామ్ గెలలను తక్షణమే కొనుగోలు చేసి, ప్రాసెస్ చేయడానికి వీలుగా నర్మేట ప్రాంతంలో అత్యాధునిక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇదివరకే ప్రారంభించారని గుర్తుచేశారు. అందువల్ల మార్కెటింగ్ లేదా అమ్మకాల విషయంలో రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగును ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామ పంచాయతీలకు ఒక అద్భుతమైన ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించారు. ఒకవేళ చిన్న గ్రామాలలో రైతులందరూ కలిసి 100 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు దాటిస్తే.. సదరు గ్రామానికి రూ.5 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామన్నారు. అదేవిధంగా పెద్ద గ్రామాలలో 200 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగును ప్రోత్సహిస్తే ఏకంగా రూ.10 లక్షల ప్రత్యేక ముందస్తు అభివృద్ధి ప్రోత్సాహక నిధులను ప్రభుత్వం తరపున అందజేస్తామని వెల్లడించారు. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించుకోవచ్చని వివరించారు.

రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వాతావరణ మార్పుల కారణంగా 'ఎల్‌నినో' ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ నివేదికలు హెచ్చరిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, కరవు కాటకాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలను తగ్గించి.. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను వేసుకోవడం ఉత్తమమని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు తమ పంటల వ్యూహాన్ని మార్చుకోకపోతే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రస్తుతం రైతులు కోతులు, అడవి పందుల వల్ల పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయితే ఆయిల్ పామ్ సాగు ద్వారా అలాంటి కోతుల బెడద అస్సలు ఉండదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ పంటకు ఎలాంటి వాతావరణ మార్పుల వల్ల వచ్చే ఇబ్బందులు కానీ, కీటకాల తెగుళ్ల భయం కానీ ఉండవన్నారు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువగా ఉండే ఈ పంటపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాజకీయాలకు పూర్తిగా అతీతంగా, కేవలం రైతాంగ సంక్షేమం గురించి ఆలోచించే ప్రతి ఒక్కరూ ఆయిల్ పామ్ సాగు విశిష్టతను రైతులకు వివరించాలని పిలుపునిచ్చారు. సదస్సులో పాల్గొన్న మరో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా దేశానికి ఆయిల్ పామ్ సొంత ఉత్పత్తి అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న ఇరాన్ యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయంగా వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. మనం వేరే దేశాల నుంచి ఆయిల్ పామ్‌ను దిగుమతి చేసుకుంటే భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థపై భారంతో పాటు సామాన్యులకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఆయిల్ పామ్ పంటకు పెద్దగా నీటి అవసరం లేదని, అందుకే తన సొంత నియోజకవర్గమైన చెన్నూరులో కూడా రైతులు ఇప్పుడు వేగంగా ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో హుస్నాబాద్ రైతులను ప్రోత్సహిస్తూ.. "100 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ఇస్తే.. ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా నా తరపున మరో రూ.5 లక్షల అదనపు ప్రోత్సాహకం ఇస్తాను" అని మంత్రి వివేక్ బంపర్ అనౌన్స్‌మెంట్ చేశారు.

గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి ఆశించిన స్థాయిలో నీటి సరఫరా లేనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కాపాడిందని మంత్రి వివేక్ వెంకటస్వామి గుర్తుచేశారు. ప్రాజెక్టు నీళ్లు లేకపోయినా రైతులు పండించిన వరి ధాన్యాన్ని మునుపటి సంవత్సరం కంటే దాదాపు 25 శాతం అదనంగా ప్రభుత్వం తరపున కొనుగోలు చేయడం జరిగిందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం, ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు కూడా డ్రిప్ ఇరిగేషన్, రాయితీలు మరియు సాంకేతిక సహాయాన్ని సకాలంలో అందించి సంపూర్ణంగా అండగా నిలుస్తుందని మంత్రులిద్దరూ రైతులకు గట్టి భరోసా ఇచ్చారు.

# క్రీడా రాజధానిగా భారత్

**మొదటిపేజీ తరువాయి**

ఇవ్వనుందని ఆయన వెల్లడించారు. దీనితో పాటు, క్రీడా ప్రపంచంలోనే అత్యున్నతమైన 2036 ఒలింపిక్స్ క్రీడలను భారతదేశంలో విజయవంతంగా నిర్వహించడమే లక్ష్యంగా తాము రాత్రింబగళ్లు కష్టపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ మెగా ఈవెంట్‌ల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను, స్టేడియంలను భారీ ఎత్తున అభివృద్ధి చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.

తన పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ ప్రసిద్ధ చారిత్రాత్మక క్రీడా వేదిక అయిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువ క్రికెటర్లతో ప్రధాని మోదీ ఎంతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి క్రీడా నైపుణ్యాలను అడిగి తెలుసుకుంటూ, యువ క్రీడాకారుల జెర్సీలపై తన ఆటోగ్రాఫ్ (సంతకాలు) చేసి వారిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఆస్ట్రేలియా అధికారిక క్రీడా చిహ్నమైన "రూబీ ది రూ" అనే బొమ్మతో ప్రధాని సరదాగా ఫోటోలు దిగారు. ఇదే సమయంలో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు దిగ్గజ మాజీ కెప్టెన్ స్టీవ్ వా మైదానంలో ప్రధాని మోదీని ప్రత్యేకంగా కలిసి మర్యాదపూర్వకంగా మాట్లాడారు. స్టీవ్ వా రాకతో ఈ కార్యక్రమానికి మరింత క్రికెట్ శోభ సంతరించుకుంది.


మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టగానే ఏ భారతీయ క్రీడాభిమానికైనా ఒకేసారి రెండు రకాల బలమైన భావోద్వేగాలు కలుగుతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మొదటిది భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య మైదానంలో జరిగే హైవోల్టేజ్ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించిన అద్భుతమైన ఉత్సాహమైతే.. రెండోది, మన రెండు దేశాల్లోనూ క్రికెట్ అనేది కేవలం ఒక సాధారణ ఆట మాత్రమే కాదనే నిజం అని చెప్పారు. ఇరు దేశాల కోట్లాది మంది ప్రజల గుండెల్లో క్రికెట్ అనేది ఒక ఉమ్మడి శ్వాసగా, ఒక గొప్ప అనుబంధంగా మారిపోయిందని ప్రధాని అభివర్ణించారు. క్రీడల ద్వారా రెండు దేశాల సాంస్కృతిక బంధం మరింత బలపడుతోందని ఆకాంక్షించారు.

మెల్‌బోర్న్ మైదాన పర్యటనకు వెళ్లడానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా దేశ ప్రతిపక్ష నాయకుడు అంగస్ టేలర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉన్నత స్థాయి భేటీలో ఇరుదేశాల మధ్య ఉన్న అంతర్జాతీయ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. భారత్‌ఆస్ట్రేలియా సత్సంబంధాలు గడిచిన కొన్నేళ్లుగా ఎంత వేగంగా బలపడుతున్నాయి, అలాగే రాబోయే రోజుల్లో ఇరు దేశాల వ్యాపార, రక్షణ రంగాలలో ఎలాంటి కొత్త అవకాశాలు ఉన్నాయి అనే అంశాలపై తామిద్దరం ఎంతో ఆసక్తికరమైన చర్చలు జరిపినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆస్ట్రేలియా అంతటా భారతదేశ భాగస్వామ్యానికి లభిస్తున్న అపూర్వ ఆదరణకు, విస్తృత మద్దతుకు తానేంతో విలువ ఇస్తానని చెప్పారు.

ప్రతిపక్ష నేత అంగస్ టేలర్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "ఆస్ట్రేలియా ప్రతిపక్ష నాయకుడు అంగస్ టేలర్‌ను కలవడం సంతోషంగా ఉంది. ఇరు దేశాల బంధం బలపడుతున్న తీరు, ముందున్న అనేక అవకాశాలపై మేమిద్దరం విస్తృతంగా చర్చించాం" అని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో పేర్కొన్నారు. దీనిపై ఆస్ట్రేలియా ప్రతిపక్ష నేత అంగస్ టేలర్ కూడా సానుకూలంగా స్పందిస్తూ ఎక్స్ వేదికగా మరో పోస్ట్ పెట్టారు. భారతదేశం, ఆస్ట్రేలియా దేశాల మధ్య ఎంతో గర్వించదగిన స్నేహం ఉందని, రెండు దేశాలూ గొప్ప సంస్కృతిని, గర్వించదగిన సమాజాన్ని, అనేక అద్భుతమైన అవకాశాలతో నిండిన భవిష్యత్తును పంచుకుంటున్నాయని ఆయన కొనియాడారు.

ఈ పర్యటనలో భాగంగా అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో నిర్వహించిన ద్వైపాక్షిక చర్చలు భారీ విజయాన్ని సాధించాయి. ఇరుదేశాల ఇంధన అవసరాలను తీర్చేందుకు వీలుగా భారతదేశానికి 'యురేనియం' ఖనిజం ఎగుమతులను సులభతరం చేసే పౌర అణు ఒప్పందాన్ని అమలులోకి తీసుకురావడానికి ఇరు దేశాలూ అధికారికంగా అంగీకరించాయి. దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారతదేశానికి అణు ఇంధన సరఫరా ప్రక్రియ చాలా సులభతరం కానుంది. ఈ చారిత్రక ఒప్పందం ద్వారా భారతదేశంలోని అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన ఇంధన కొరత తీరడమే కాకుండా, దేశీయ ఇంధన భద్రత మరింత పటిష్టం కానుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇరు దేశాల ప్రధానుల సమక్షంలో భారత్‌ఆస్ట్రేలియా ఉమ్మడి సముద్ర భద్రతా సహకార రోడ్‌మ్యాప్‌లను రక్షణ వర్గాలు ఆమోదించాయి. దీనితో పాటు అంతర్జాతీయ సైబర్ భద్రత, అధునాతన సాంకేతికతలు, భూగర్భ మైనింగ్ పరిశోధనలు, ఉన్నత విద్యా రంగం, శాస్త్రీయ పరిశోధనలు మరియు పరస్పర సాంస్కృతిక మార్పిడి వంటి అనేక కీలక రంగాలలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇరు దేశాలూ విస్తరించుకున్నాయి. భవిష్యత్తు పారిశ్రామిక అవసరాల దృష్ట్యా



ఆస్ట్రేలియా నుంచి భారతదేశానికి బొగ్గు, వివిధ రకాల ద్రవ ఇంధనాలు మరియు సహజవాయువు (నాచురల్ గ్యాస్) నిరంతరాయంగా సరఫరా చేసే అంశం కూడా ఈ తాజా ద్వైపాక్షిక ఒప్పందాల జాబితాలో ప్రధానంగా చోటుచేసుకుంది. ఆస్ట్రేలియాలో అత్యంత ఆదరణ కలిగిన ప్రసిద్ధ టీ20 టోర్నమెంట్ 'బిగ్ బాష్ లీగ్' మ్యాచ్‌లలో కొన్నింటిని భారతదేశంలోని క్రీడా రాజధాని చెన్నై నగరంలో నిర్వహించనుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ఏ రకమైన క్రీడా లీగ్‌కైనా సరే, భారతదేశంలో ఒక అధికారిక ఈవెంట్‌ను లేదా మ్యాచ్‌ను నిర్వహించడం ద్వారా ఆయా లీగ్‌లకు అంతర్జాతీయంగా ఊహించని రీతిలో విస్తృతమైన గుర్తింపు మరియు అపారమైన మార్కెట్ లభిస్తాయని ప్రధాని స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా, భారత్ దేశాల క్రికెట్ బోర్డుల మధ్య కుదిరిన ఈ సరికొత్త అవగాహన రెండు దేశాల క్రీడాకారుల నైపుణ్యాలను మార్పిడి చేసుకోవడానికి ఎంతో దోహదపడుతుందని ప్రధాని మోదీ కొనియాడారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూలై 11–18 వరకు ప్రత్యేక కుటుంబ నియంత్రణ వారోత్సవం

- **జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. జె. వెంకటి**

**కామారెడ్డి, జూలై 10(డిడి9 వార్త):**

ప్రపంచ జనాభా దినోత్సవం2026ను పురస్కరించుకుని జూలై 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కుటుంబ నియంత్రణ వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. జె. వెంకటి తెలిపారు. కేంద్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పిల్లల మధ్య సరైన విరామం పాటించడం, తల్లి శిశు మరణాలను తగ్గించడం, అధిక ప్రమాద గర్భధారణలను నివారించడం, ఆరోగ్యవంతమైన కుటుంబాల నిర్మాణమే ఈ వారోత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది సందేశం "పిల్లలకు సరైన అంతరం ఉంటే, కుటుంబాలు ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉంటాయి" అని వెల్లడించారు.

వారోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీలు, గ్రామ సభలు, మహిళా సంఘ సమావేశాలు, యువ దంపతులకు ప్రత్యేక కౌన్సెలింగ్, గర్భిణీలు, బాలింతలకు కుటుంబ నియంత్రణ సేవలపై అవగాహన, ఇంటింటి ప్రచారం, పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, ప్రత్యేక కుటుంబ నియంత్రణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో కండోమ్‌లు, గర్భనిరోధక మాత్రలు, ఛాయా మాత్రలు, అంతర ఇంజెక్షన్, కాపర్‌టి, ప్రసవానంతర కాపర్‌టి, మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు నోస్కాల్పెల్ వాసెక్టమీ (ఎన్‌ఎస్వి ) వంటి కుటుంబ నియంత్రణ సేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.పిల్లల మధ్య సరైన విరామం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శిశువుల మరణాలు తగ్గడం, తక్కువ బరువుతో పుట్టే శిశువుల సంఖ్య తగ్గడం, కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడడం, పిల్లల విద్య, ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ వారోత్సవంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఫీహెచ్‌ఏలు, వైద్యాధికారులు కలిసి అర్హులైన దంపతుల నమోదు, ఇంటింటి సందర్శనలు, కౌన్సెలింగ్, ప్రసవానంతర కుటుంబ నియంత్రణపై సూచనలు, ఆరోగ్య కేంద్రాలకు తరలింపు, శస్త్రచికిత్స శిబిరాలకు ప్రోత్సాహం, సేవల అనంతరం ఫాలోఅప్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

ప్రతి అర్హులైన దంపతులు తమకు అనుకూలమైన కుటుంబ నియంత్రణ పద్ధతిని ఎంపిక



చేసుకుని సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. జె. వెంకటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన శిశువు, సంతోషకరమైన కుటుంబం, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## బోధన్‌లో విద్యుత్ సరఫరాకు ఆటంకం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో నిర్వహించనున్న సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఏఈ కృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3:30 నిమిషాల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని కాలనీల్లో విద్యుత్ నిలిపివేస్తారు. రాకాసిపేట్ ఫీడర్ పరిధిలోని రాకాసిపేట్, భీముని గుట్ట ప్రాంతాల్లో ట్రీ కటింగ్ పనులు, మెయింటెనెన్స్ పనుల దృష్ట్యా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## జిల్లా స్థాయి యోగ పోటీలో సోనాల విద్యార్థినిల ఎంపిక...

తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ ఆధ్వర్యములో జిల్లా కేంద్రములో జరిగిన జిల్లా యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలో సోనాల మండలానికి కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థినిలు ప్రాంజల్, జయ జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యారు అని తరువాత జరిగబోయే నెక్స్ట్ లెవెల్ పోటీలో పాల్గొంటారు అని యోగ శిక్షకురాలు మునిగెల యోగిత తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి వై ఎస్ ఓ దయానంద్ రెడ్డి పాల్గొన్నారు.పోటీలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలనీ జిల్లాల అసోసియేషన్ ప్రెసిడెంట్ యోగ గురువు తిరుపతి రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ అనిమెస్ బాబు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏ డి వైఎస్ ఎ జనరల్ సెక్రటరీ చేతన్ , ఏ డి వై ఎస్ ఎ టెక్నికల్ & ఆర్గనైజర్ సెక్రటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరి

- **ఎంఈవో నాగయ్య**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

బోధన్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మైనారిటీ, రెసిడెన్షియల్ మరియు సాంఘిక సంక్షేమ ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులతో బోధన్ పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎంసీ (జేసీ)లో మండల విద్యాధికారి నాగయ్య శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు డిగ్రీ మొదటి సంవత్సరం వరకు చదువుతున్న 1 నుంచి 19 ఏళ్లలోపు వయస్సు గల విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం తర్వాత ఆల్బెండాజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమత, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ విద్య మాట్లాడుతూ నులిపురుగుల నివారణ వల్ల పిల్లల్లో పోషకాహార లోపం తగ్గి, శారీరక మరియు మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. విద్యార్థులందరికీ ఈ మాత్రలు అందేలా చూడటంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యాసంస్థల యాజమాన్యాలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఫాతిమా, వైద్య సిబ్బంది కిరణ్, రాజు, రవి, ఐసిడిఎస్ సిబ్బందితో పాటు పలు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.





## ఎస్సీ బాలుర జూనియర్ కళాశాల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన విద్యార్థి సంఘాల నాయకులు

**బాన్సువాడ,జులై 10(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వసతిగృహాన్ని విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజన నాణ్యత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్. బాల్‌రాజ్, పీడీఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్ మాట్లాడుతూ,హాస్టల్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకెళ్లాలని, పరిష్కారం కాకపోతే విద్యార్థి సంఘాలకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, స్వచ్ఛమైన తాగునీరు,పరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు,ఇతర మౌలిక సదుపాయాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని హాస్టల్ వార్డెన్ శివరాంకు విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇకపై హాస్టల్ వార్డెన్లు విద్యార్థుల సంక్షేమం, సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు సాయిబాబా, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు పుట్ట భాస్కర్‌తో పాటు పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## బీఎల్‌ఓల పనితీరుపై ఆర్డీఓ ప్రశంసలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

సర్2026 డిజిటైజేషన్ ప్రక్రియలో వంద శాతం పురోగతి సాధించిన ఇద్దరు బీఎల్‌ఓలను ఆర్డీఓ విజయకుమారి అభినందించారు. బోధన్ నియోజకవర్గంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సునంద, బండార్పల్లి గ్రామానికి చెందిన అనసూయ తమ పోలింగ్ స్టేషన్ల పరిధిలో డిజిటైజేషన్ పనులను వేగంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వారిని ప్రత్యేకంగా అభినందించి, ప్రోత్సహించారు. తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా బీఎల్‌ఓలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీ.విఠల్, ఏఓ ఈ.సాయిలు, నాయిబ్ తహసీల్దార్ నాగమణి, సీనియర్ అసిస్టెంట్ సుశీల, ప్రణాళికా గణాంకాల అధికారి అశోక్, ఆపరేటర్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ చక్రేశ్వర శివాలయ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ చక్రేశ్వర శివాలయ నూతన పాలకవర్గం శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా లక్ష్మణ్ రావు పటేల్, ధర్మకర్తలుగా ఆరుగొండ శంకర్, గంగాధర్, వీరప్ప, మౌనిక పోశెట్టిలను ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రధాన అర్చకులు గణేష్ మహారాజ్, మహేష్ పంతులు, శివకుమార్ల వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను పలువురు ప్రముఖులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చైర్మన్ లక్ష్మణ్ రావు పటేల్ పేర్కొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ రావు పట్వారి తదితరులు పాల్గొన్నారు.








# గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

- **కామారెడ్డి డివిజన్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొనడం**

**కామారెడ్డి, జూలై 10(డిడి9 వార్త):**

గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, అమలుపై జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.కలెక్టర్ మాట్లాడుతూ 2026-27, 2027-28, 2028-29 సంవత్సరాలకు గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను ప్రజల భాగస్వామ్యంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల సమన్వయంతో రూపొందించాలని సూచించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ పారదర్శకంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.గ్రామ పంచాయతీయే గ్రామీణాభివృద్ధికి మూలం. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి. శిక్షణలో వివరించే అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి" అని కలెక్టర్ సూచించారు.విభిజిఐఆర్ఏఎమ్‌జి పథకాన్ని సమర్థవంతంగా వినియోగించి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులను పారదర్శకంగా వినియోగించి, గ్రామ పంచాయతీలు తమ స్వంత ఆదాయ వనరులను పెంచుకోవడం ద్వారా 10 శాతం పనితీరు గ్రాంట్ పొందేలా కృషి చేయాలని సూచించారు.మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో తొలి 10 స్థానాల్లో నిలిచిందని పేర్కొంటూ, రెండో విడతలో జిల్లాను పూర్తిస్థాయి హట్‌ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్‌లు సహకరించాలని కోరారు.అలాగే బడిబాట కార్యక్రమంలో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి మురళి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, డీఎల్పీఓ శ్రీనివాస్, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జిల్లా బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శిగా అనిల్ కుమార్

**నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా నాయి బ్రాహ్మణ సంఘానికి చెందిన అనిల్ కుమార్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా బీసీల హక్కుల కోసం, నాయి కుల సభ్యుల అభ్యున్నతి కోసం అనిల్ కుమార్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం గంగా కిషన్ మాట్లాడుతూ, అనిల్ కుమార్ నియామకంతో జిల్లాలో బీసీ సంక్షేమ సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్‌తో పాటు పోల్కం గంగా కిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, కోడూరు స్వామి, రవణ స్వామి, గంగాధర్, సురేందర్, నరహరి, గోపి తదితర నాయకులు పాల్గొని అనిల్ కుమార్‌ను అభినందించారు.





# నిజామాబాద్‌లో నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ

**నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కోట గల్లి శంకర్ భవన్ హైస్కూల్ వద్ద సోమవారం నిర్వహించే కార్యక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని చేపట్టారు. పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రాజశ్రీ జెండా ఊపి ప్రారంభించగా 'మనందరి పంతం.. నులిపురుగుల అంతం' అంటూ విద్యార్థులు నినాదాలతో కోటగల్లి వీధులను హోరెత్తించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... జిల్లాలోని 3,90,297 మంది విద్యార్థులకు జూలై 13న ఆల్బెండజోల్ మాత్రలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ మాత్రలు ఎంతో కీలకమని, ఏలికపాములు, కొంకిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, అలసట, కడుపునొప్పి వంటి ఆరోగ్య సమస్యల నివారణకు వీటిని నమిలి మింగాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా చేతుల శుభ్రతపై విద్యార్థులకు, ఆశా కార్యకర్తలకు ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, పలువురు వైద్యాధికారులు, సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణలో రాజీ వద్దు: నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

- **ఆర్మూర్ డివిజన్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం**

**నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**



రాబోయే పండుగల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్‌లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు నిరంతర తనిఖీలు చేపట్టాలని, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ అప్రమత్తత వీడకూడదని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న హత్యలు, చోరీలు, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, గంజాయి అక్రమ రవాణా వంటి కేసులను వేగవంతంగా దర్యాప్తు చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు. సరిహద్దు జిల్లాలైన నిర్మల్, జగిత్యాల నుంచి వచ్చే వాహనాలు, వ్యక్తులపై నిఘా పెంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన వారి కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దాడులు నిర్వహించి, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం షీటీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు నేషనల్, స్టేట్ హైవే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం, మైనర్లు వాహనాలు నడపకుండా అడ్డుకోవడం వంటి అంశాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, స్టేషన్లలో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ గురునాయుడు, ఆయా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.






# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన డీఎంహెచ్‌వో డా. జె. వెంకటి

**కామారెడ్డి, జూలై 10(డిడి9 వార్త):**



జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, సేవల నాణ్యత, లక్ష్యాల సాధనపై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కార్యాలయంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. జె. వెంకటి సమావేశానికి అధ్యక్షత వహించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో మాతా-శిశు ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, సాధారణ టీకాల కార్యక్రమం (యుఐపి), క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్టిఈపి), మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా నియంత్రణ, రక్తహీనత నివారణ, అసంక్రమిత వ్యాధుల (ఎన్సిడి) స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య & వెల్‌నెస్ కేంద్రాల సేవలు,ఆర్బిఎస్కె ,ఆర్కెఎస్కె, పిఎమ్ఎస్ఎమ్ఎ,పిసిపిఎన్డిటి చట్టం అమలు,సిఈఎ,హెచ్ఎఫ్ఆర్ నమోదు, వ్యాధుల నిఘా (ఐడిఎస్పి), ఆరోగ్య విద్య కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణ చర్యలను మరింత వేగవంతం చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని డా. జె. వెంకటి అధికారులకు సూచించారు. అలాగే ఆరోగ్య కేంద్రాల రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు ఫీల్డ్ పర్యవేక్షణను బలోపేతం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సి. నర్సింగ్ చౌహాన్, ప్రోగ్రామ్ అధికారులు డా. జి. రాజు, డా. బి. వెంకటస్వామి, డా. ప్రదీప్, బి. మహేందర్ రెడ్డి, చలపతి, శ్రీనివాస్ రెడ్డి, సాలమ్మ, కె. జీవన్, శోభ, అశ్విని, సంతోష్ రెడ్డి తదితరులతో పాటు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల సీహెచ్‌వోలు, హెచ్ఈవోలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఇతర పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.





# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**

**కామారెడ్డి, జూలై 10(డిడి9 వార్త):**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు.శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేసి, ఈ నెల 24వ తేదీలోపు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు.

అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన ప్రతి ఓటరిని ముసాయిదా జాబితాలో చేర్చుతామని, సరైన విచారణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల అర్హతను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తుది ఓటరు జాబితా విడుదల అనంతరం ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం, డిజిటలైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఫారాల పంపిణీని ఈరోజే పూర్తి చేసి, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు. కామారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డేటా ఆధారంగా ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, కామారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

- **నవంబర్ 28న ప్రవేశ పరీక్ష**
- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి,జూలై 10(డిడి9 వార్త):**



జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027-28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ లేదా ప్రవేశ దరఖాస్తుల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని నిర్ణయించిన పరీక్షా కేంద్రాల్లో నవంబర్ 28, 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

జిల్లాలోని అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు

# ప్రశాంతంగా ముగిసిన బోధన్ చేనేత సంఘం ఎన్నికలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**



బోధన్ పట్టణంలోని చేనేత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిందని ఎన్నికల అధికారి జియా ఉద్దీన్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం వెల్లడైన ఫలితాల ప్రకారం అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. లోలా శంకర్ 177 ఓట్లతో అగ్రస్థానంలో నిలవగా, మోత్కురి రాయణ 176 ఓట్లు, భేటీ గంగారం 149 ఓట్లు, మోత్కురి లక్ష్మణ్ 133 ఓట్లు, శ్యామ్ సుందర్ 130 ఓట్లు, మోత్కురి సాయిలు 127 ఓట్లు, తాటి పాముల అజయ్ 121 ఓట్లు సాధించి ఎన్నికయ్యారు. మహిళా విభాగంలో మోత్కురి కళావతి 202 ఓట్లు సాధించి విజయభేరి మోగించగా, జె.లక్ష్మి 191 ఓట్లతో విజేతగా నిలిచారు. ఎన్నికైన అభ్యర్థులకు చేనేత సంఘం సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల మానసిక ఆరోగ్యం, హాస్టల్ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కీలక సూచనలు**



**కామారెడ్డి, జూలై 10(డిడి9 వార్త):**

విద్యార్థుల మానసిక ఆరోగ్యం, హోమ్‌సిక్ సమస్యలు, హాస్టళ్లలో సంక్షేమ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. వసతి గృహాలు, గురుకులాల్లో అమలు చేస్తున్న సంక్షేమ చర్యల్లో విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి అని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రతి హాస్టల్‌లో హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విద్యార్థులతో పీర్ గ్రూపులను ఏర్పాటు చేయాలని, విద్యార్థుల ప్రవర్తన, మానసిక స్థితి, ఒత్తిడి లక్షణాలను గమనించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులను ముందుగానే గుర్తించి తగిన సహాయం అందించడం ద్వారా తీవ్ర పరిణామాలను నివారించవచ్చని తెలిపారు.సాయంత్రం వేళల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక చర్చలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థులు హాస్టల్ వాతావరణానికి అలవాటు పడే వరకు, ముఖ్యంగా విద్యా సంవత్సరం తొలి మూడు నెలల్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని ఆదేశించారు.ప్రిన్సిపల్స్, వార్డెన్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, గురుకుల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వి. గిరి, జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు బోధన్ చేనేత సహకార సంఘం పదవుల ఎన్నిక

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

బోధన్ మండలంలోని చేనేత సహకార సంఘానికి ఎన్నికైన పాలకవర్గ సభ్యుల సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి మహమ్మద్ జియావుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10:30 నిమిషాలకు సొసైటీ కార్యాలయంలో జరుగుతుందని, సంఘం యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈ భేటీని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి లోలా శంకర్, మోత్కురి నారాయణ, భేటీ గంగారం, మోత్కురి లక్ష్మణ్, శ్యామ్ సుందర్ ఫాడే, మోత్కురి సాయిలు, తాటిపాముల అజయ్ కుమార్, మోత్కూరి కళావతి మరియు జోరిగల లక్ష్మి ఎన్నికైన సభ్యులందరూ నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## విద్యుత్ ఘాతంతో రైతు మృతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**




విద్యుత్ మోటారుకు వైర్లు కలుపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై రైతు మృతి చెందిన విషాద ఘటన నవీపేట్ మండలంలోని నిజాంపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపూర్ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మణ్ (42) ఉదయం తన పొలం వద్దకు నీరు పెట్టేందుకు వెళ్లారు. మోటారు స్టార్టరుకు వైర్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుత్ ప్రసరించి, ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడి భార్య లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీపేట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. రైతు మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పాత్రికేయుల ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ వారిచే ఉచిత మెగావైద్య శిబిరం..

**నిజామాబాద్ పోతంగల్ జూలై 10( డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని గ్రామ పంచాయతీలో డాక్టర్.కె.వి.రెడ్డి మెమోరియల్ హాస్పటల్ లైన్స్ క్లబ్ బోధన్ వారి ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి అని లైన్స్ క్లబ్ ఇన్చార్జి హనుమంతరావు అన్నారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొతంగల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వైద్య చికిత్సలు,800 మందికి ఉచితంగా చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. 20 మందికి కంటి చికిత్సలు, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని అన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఏ కొంచెం అనారోగ్యం అన్పించిన వెంటనే ఆస్పత్రిలోని వైద్యులకు సంప్రదించి తగిన చికిత్సలు చేయించుకొని వారి సలహా ప్రకారం ఆరోగ్యం కాపాడుకోవాలని, కంటికి సంబంధించినటువంటి ఆపరేషన్ లో ఉంటే బోధన్ లైన్స్ క్లబ్ హాస్పిటల్ లో నిర్వహిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ హాస్పిటల్ డాక్టర్, విక్రమ్, డాక్టర్ కృష్ణ ఎంబిబిఎస్, చిన్నపిల్లల నిపుణులు వైద్యుడు డాక్టర్ ప్రవీణ్, లయన్ క్లబ్ ఇంచార్జ్ హనుమంతరావు, గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ గులాబ్ నబి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



# రిటైర్మెంట్ వేళ ఎల్ఐసీ ఉద్యోగి మోసం..

- **ఏజెంట్లు, సిబ్బంది నుంచి లక్షల వసూలు చేసి పరార్**

**నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరం ఎల్ఐసీ కార్యాలయంలో హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ఓ ఉద్యోగి, తోటి సిబ్బందిని, ఏజెంట్లను నమ్మించి భారీ మొత్తంలో నగదుతో అదృశ్యమయ్యాడు. గత రెండేళ్లుగా ఆఫీసులోని ఉద్యోగులు, పలువురు రూరల్ ఏజెంట్ల వద్ద అప్పులు తీసుకున్న సదరు ఉద్యోగి, రిటైర్మెంట్ అయిన మరుసటి రోజే బాకీలు తీరుస్తానని హామీ ఇచ్చాడు. జూన్ 30న ఆఫీసులో జరిగిన తన రిటైర్మెంట్ వేడుకలోనూ అందరినీ నమ్మబలికిన ఆయన, జూలై 1న తన ఖాతాలో పదవీ విరమణ సొమ్ము జమ కాగానే డ్రా చేసుకుని ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఆ తర్వాత ఈనెల 2న ఫోన్ ఆన్ చేసి, తాను మొత్తం నగదు చెల్లించలేనని, కేవలం 20 శాతం మాత్రమే ఇవ్వగలనని చెప్పి మళ్లీ కనిపించకుండా పోయాడు. సదరు ఉద్యోగి ముందుగానే పథకం ప్రకారం నగరంలోని పంచముఖి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న తన ఇల్లు, భూములను విక్రయించాడని ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. రిటైర్మెంట్ సొమ్ముతో పాటు ఆస్తుల అమ్మకం ద్వారా వచ్చిన నగదును తీసుకుని ఆయన పరారీ కావడంతో, తమ డబ్బులు ఎలా వస్తాయోనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు సమాచారం అందించారు.




## రుద్రూర్ గ్రామం లో రక్తదాన శిబిరం

**నిజామాబాద్ రుద్రూర్/జూలై 10 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ లయన్స్ క్లబ్, దాత్రిశ్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిజామాబాద్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు సహకారంతో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రుద్రూర్లోని శశిరేఖ ఫంక్షన్ హాల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రుద్రూర్ ఎస్సై మనోజ్కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతల నుంచి మొత్తం 28 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. లయన్స్ క్లబ్, దాత్రిశ్రీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## గంగాజలాలతో గ్రామదేవతలకు జలాభిషేకం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

రెంజల్ మండల కేంద్రంలో గంగాలీల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదో వారం ముగింపు ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి ఆధ్వర్యంలో గత నాలుగు వారాలుగా గంగాజలాలతో గ్రామదేవతలకు అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సంప్రదాయంలో భాగంగా, శుక్రవారం కందకుర్తి నుండి గంగాజలాలను తీసుకువచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేసినట్లు సర్పంచ్ వెల్లడించారు. తెల్లవారుజామున సుమారు 500 మంది గ్రామస్తులు కాలినడకన కందకుర్తికి వెళ్లి గంగాజలాలను తీసుకురాగా, గ్రామమంతా పండగ వాతావరణం నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు. బోయి సంఘం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు బోనాలు, గంగానీళ్లతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మానస రాకేష్, బోయి సంఘం అధ్యక్షులు పాముల శంకర్, పిల్లి రాజన్న, తగిలపల్లి పండరి, అంజన్న, మాజీ ఎంపీటీసీ రవి, ఇర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

బోధన్ నియోజకవర్గంలో సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంపై బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక సమీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా బోధన్ పట్టణంలోని 26, 13, 13, 36 వార్డులకు చెందిన బీఎల్ఏ ఏజెంట్లు, బోధన్ తహసీల్దార్ విట్టల్ తో ప్రజా ప్రతినిధులు, నాయకులు సమావేశమై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ పాల్గొని మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 48 శాతం మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందని, ఇది సరిపోదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదయ్యేలా ఎటువంటి లోపాలు లేకుండా బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. "ఓటరు లేనిదే ప్రజాస్వామ్యంలో ఏమీ లేదు, కాబట్టి ఈ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మ శరత్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, టౌన్ ప్రెసిడెంట్ దాము, మాజీ ప్రెసిడెంట్ పాషా, యువజన అధ్యక్షుడు తలారి నవీన్, కౌన్సిలర్లు లంక రవి, ఈరనాల శంకర్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నియోజకవర్గ ఇంచార్జులు గంగ కిషన్, శేఖర్ గౌడ్, సాలూర సర్పంచ్ సోక్కం లావణ్య తదితరులు పాల్గొన్నారు.





**పాఠశాల యందు శ్రీ రాజు పటేల్ హంగర్ గా గారిచే మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మరియు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు టెక్స్ట్ బుక్ కవర్స్ (సుమారుగా12000) నగదు ను ఇవ్వడం**

**నిజామాబాద్ పోతంగల్ జూలై 10(డిడి9 వార్త);**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ పాఠశాల యందు శ్రీ రాజు పటేల్ హంగర్గ గారిచే మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మరియు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు టెక్స్ట్ బుక్ కవర్స్ (సుమారుగా12000) నగదు ను ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల విద్యాధికారి శ్రీ సాయిలు సార్ మాట్లాడుతూ రాజు పటేల్ సహృదయంతో ఉదార స్వభావంతో పిల్లలకు ఈ విధమైన సహాయ సహకారాలు అందించినందుకు మండలంలోని ఉపాధ్యాయుల తరపున విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపటం జరిగినది. ఈ కార్యక్రమంలో హంగర్గ గ్రామ మాజీ సర్పంచ్ విజయ పటేల్ , PRTU అధ్యక్షులు శ్రీ శ్రీనివాస్ రెడ్డి సార్. కార్యదర్శి శ్రీ ప్రశాంత్ కిరణ్ బాబు మరియు ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన డం జరిగినది

## ముగిసిన ఎన్ సీ సీ వార్షిక శిక్షణ శిబిరం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండలం జానకంపేటలో నిర్వహించిన CATCIV వార్షిక ఎన్సీసీ శిక్షణ శిబిరం శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ముగిసింది. జూలై 1 నుంచి 10 వరకు కొనసాగిన ఈ శిబిరంలో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 525 మంది ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా క్యాడెట్లను నాలుగు కంపెనీలుగా విభజించి వెపన్ ట్రైనింగ్, డ్రిల్, ఎఫ్బీసీ, మ్యాప్ రీడింగ్ వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ అందించారు. వీటితో పాటు క్రీడా పోటీలను నిర్వహించి క్యాడెట్లలోని నైపుణ్యాలను మెరుగుపరిచారు. ముగింపు వేడుకల్లో భాగంగా క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.




## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఆటోల పట్టివేత

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని మందర్న, ఖాజాపూర్ గ్రామ శివార్లలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాలీ ఆటోలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ వివరాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా మంజీరా నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న ఆటోలను స్వాధీనం చేసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



# ఓసీపీ-3లో ఓబీ తరలింపులో భారీ కుంభకోణం

- డీజీఎంఎస్, సింగరేణి సీఎండీకి ఫిర్యాదు
- టెండర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వి9 సంస్థ: మద్దెల దినేష్ ఆరోపణ
- రూ.15–20 కోట్ల నష్టం జరిగే అవకాశం.. విజిలెన్స్ విచారణకు డిమాండ్
- డ్రైవర్లకు ఉద్యోగ భద్రత, కనీస సౌకర్యాలు కరువు అంటూ ఆవేదన

**పెద్దపల్లి బ్యూరో, జూలై 10(డీడీ9 వార్త):**

రామగుండం ఆర్జీ2 పరిధిలోని ఓసీపీ3లో ఓబీ మట్టి తరలింపు పనుల్లో వి9 కాంట్రాక్ట్ సంస్థ భారీ అక్రమాలకు పాల్పడుతోందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై డీజీఎంఎస్, సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఓసీపీ3 ఫేజ్ 2లో టెండర్ నిబంధనల ప్రకారం ఓబీ మట్టిని 4.5 కిలోమీటర్ల దూరంలోని ఎక్స్‌టర్నల్ డంప్‌యార్డుకు తరలించాల్సి ఉండగా, వి9 సంస్థ కేవలం 400 మీటర్ల దూరంలోని ఇంటర్నల్ డంప్‌యార్డులోనే డంపింగ్ చేస్తూ, ఎక్స్‌టర్నల్‌గా తరలించినట్లు రికార్డులు చూపిస్తోందని ఆరోపించారు. ఈ అక్రమాల కారణంగా డీజిల్, నిర్వహణ, రవాణా వ్యయాల పేరిట సింగరేణి సంస్థకు రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ వ్యవహారంలో స్థానిక అధికారులు సహకరిస్తున్నారంటూ ఆరోపించారు. వి9 సంస్థ వద్ద 35 డంపర్లు, 35 వోల్వోలు, 10 స్కానియా వాహనాలు పనిచేస్తుండగా, వాటిలో ఎక్కువ వాహనాలు ఇంటర్నల్ డంపింగ్‌కే వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.



అదేవిధంగా వి9 సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు సరైన సమయానికి వేతనాలు చెల్లించడం లేదని, కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై వెంటనే సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాల ద్వారా జరిగిన నష్టాన్ని సంబంధిత సంస్థ నుంచి రికవరీ చేసి సింగరేణి ప్రయోజనాలను కాపాడాలని, లేకపోతే న్యాయపోరాటం చేపడతామని మద్దెల

## ఖరీఫ్ సాగులో నాణ్యమైన విత్తనాలు వినియోగించాలి: వ్యవసాయ శాఖ

**ములుగు, జూలై 10, డీ డీ 9వార్త**

ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలనే వినియోగించాలని ములుగు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. అధీకృత విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రసీదులను భద్రపరచుకోవాలని తెలిపారు.

వర్షాల పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, పొలాల్లో నీటి నిల్వను నియంత్రించే చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పంటల్లో చీడపీడలు లేదా వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు.



## ఎన్‌టీపీసీ లో అత్యాధునిక ఎస్అండ్‌టీ ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌ల ప్రారంభం

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత చేతుల మీదుగా ప్రారంభం
- ఎంజీఆర్ రైల్వే నెట్‌వర్క్‌లో భద్రత, రైలు రాకపోకల సామర్థ్యం మరింత పెంపు

**పెద్దపల్లి బ్యూరో, జూలై 10(డీడీ9 వార్త):**

ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, రామగుండం ఎంజీఆర్ రైల్వే నెట్‌వర్క్‌లో ఇప్పటికే ఉన్న రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో అనుసంధానించిన సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌లను నిర్ణీత నాన్‌ఇంటర్‌లాకింగ్ వ్యవధిలో విజయవంతంగా కమిషన్ చేసింది. నూతన లెవల్ క్రాసింగ్‌లను ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం (ఓఅండ్ఎం) ముకుల్ రాయ్, జీఎం (ఓఅండ్ఎం) మనీష్ అగర్వాల్, జీఎం (ప్రాజెక్ట్స్) బినోయ్ జోస్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ ఆధునిక ఇంటర్‌లాక్డ్ లెవల్ క్రాసింగ్‌ల ఏర్పాటు ద్వారా ఎంజీఆర్ రైల్వే నెట్‌వర్క్‌లో రైలు రాకపోకల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు తెలంగాణ స్టేజ్-2 నిర్మాణ పనులకు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ రవాణాకు నిరంతర అనుసంధానం కల్పించనుంది. ఈ వ్యవస్థ రైల్వే ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చడంతో పాటు ప్లాంట్ కార్యకలాపాల్లో భద్రత, విశ్వసనీయతను పెంచుతుందని అధికారులు తెలిపారు. ఎన్‌టీపీసీ ఆధునిక రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదనే విషయాన్ని ఈ ప్రాజెక్టు మరోసారి చాటిచెప్పిందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగపేట మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం

**మంగపేట,జూలై 10డీడీ 9 వార్త**



ప్రభుత్వ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కళాశాల విద్యార్థులకు కళాశాల వేళల్లో ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగపేట మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చెట్టిపల్లి చందు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే కళాశాల విద్యార్థులకు సమయానికి కళాశాలలకు చేరుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు రావాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కల్వర్టు వెడల్పు పెంచండి సారు

- నల్లగుంటలో వరద నీటితో పొంచి ఉన్న ప్రమాదం
- కల్వర్టు వెడల్పు పెంచాలి అంటున్న ప్రజలు
- పాత కల్వర్టు కొలతల ప్రకారమే కడుతున్నాం
- అంటున్న స్థానిక కాంట్రాక్టర్
- నిబంధనల మేరకే కల్వర్టు నిర్మాణం జరుగుతుంది
- గ్రామస్తులకు ఇబ్బంది ఉంటే వెడల్పు పెంచుతాం
- పంచాయతీరాజ్ శాఖ ఏఈ పూర్ణచందర్

**ములుగు, జులై 10, డీ డీ 9 వార్త :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో ఇరుకైన కల్వర్టుతో తాము ఇబ్బందులు పడతామని 9వ వార్డుకు చెందిన ప్రజలు తెలిపారు. నల్ల గుంట గ్రామంలో నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డు లో గ్రామం లో ఉన్న బిలుక్కుంట లోకి వర్షపు వరద నీరు వెళ్లేందుకు గతంలోనే రాళ్లతో కల్వర్టు కట్టి ఉంది. ప్రస్తుతము గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ సి సి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతూ కుంటలోకి వర్షపు వరద నీరు వెళ్లేందుకు కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారు. అయితే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మురళి, 9వ వార్డుకు చెందిన ఓదెలు మరికొంతమంది ఇరుకు కల్వర్టుతో వరద నీరు వెళ్లదని ఆ నీటి కారణంగా ఇళ్లలోకి నీళ్లు వచ్చి తాను ఇబ్బంది పడతామని తెలిపారు. కల్వర్టు వెడల్పు పెంచి నీళ్లు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కాంట్రాక్టర్కు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ఈ విషయమై సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడగా గతంలో ఉన్న వెడల్పు కొలతలతోనే ప్రస్తుతం స్కిన్ వాళ్ళు నిర్మించి కల్వర్టు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారమే తాను కల్వర్టు నిర్మిస్తున్నానని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవని ఆయన స్పష్టం చేశారు.

**నిబంధనల ప్రకారమే కల్వర్టు నిర్మాణం పి ఆర్ ఏ ఈ పూర్ణచందర్**

నల్లగుంట గ్రామంలో బిలుక్కుంటకు వెళ్లే కల్వర్టు నిర్మాణం నిబంధనలు మేరకే నిర్మించే విధంగా చర్యలు చేపడతామని పి ఆర్ ఏ ఈ పూర్ణచందర్ తెలిపారు. గ్రామ ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్నట్లయితే కల్వర్టు నిర్మాణం వెడల్పు పెంచే విధంగా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.



## సిక్సర్ల మోజు తగ్గించుకోవాలి.. వైభవ్, అభిషేక్‌పై బీసీసీఐ ఫోకస్!

- ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ పేలవ ప్రదర్శన
- అభిషేక్ శర్మ, వైభవ్ ఆటతీరుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి
- సిక్సర్లు బాదే ఉత్సాహం నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందని బీసీసీఐ ఆలోచన
- ఇన్నింగ్స్‌ను నిర్మించే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించే యోచన




**డీ డీ 9 వార్త :**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో యువ ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వీరిద్దరి దూకుడు బ్యాటింగ్, భారీ షాట్లపై ఆధారపడే ధోరణిని బోర్డు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. "అభిషేక్, వైభవ్‌కు సిక్సర్లు బాదే సామర్థ్యం అద్భుతంగా ఉంది. కానీ ఆ ఉత్సాహాన్ని నియంత్రించుకోవడం కూడా నేర్చుకోవాలి" అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి.

15 ఏళ్ల వయసులోనే భారత్ తరఫున అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు ఇంగ్లండ్ సిరీస్‌లో 14, 13, 15 పరుగులకే పరిమితమయ్యాడు. అయితే ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు, 72 సిక్సర్లతో అదరగొట్టిన అతడు ఆరెంజ్ క్యాప్‌తో పాటు పలు అవార్డులు కూడా గెలుచుకున్నాడు. మరోవైపు అభిషేక్ శర్మ మాత్రం ఇంగ్లండ్ సిరీస్‌లో 59, 43, 10, 16 పరుగులు చేసినా మ్యాచ్‌ను మలుపుతిప్పే ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. దీంతో యువ ఓపెనర్ల దూకుడుతో పాటు పరిస్థితులకు తగ్గట్టుగా ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే నైపుణ్యాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం.

## గురుకుల పాఠశాలల సూపరింటెండెంట్ బదిలీ

**నిజామాబాద్ జిల్లా జులై 10(డీడీ9 వార్త) :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల సూపరింటెండెంట్ పున్నం వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆయనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత 23 నెలల పాటు ఉమ్మడి జిల్లాలో ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సమన్వయ అధికారి సత్యనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో వెంకటేశ్వర్లు నిబద్ధతతో పనిచేశారని, తోటి ఉద్యోగులతో ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారని తెలిపారు.



## లక్ష్మీదేవి పేటలో పైపులైన్లు డ్యామేజీలకు మరమ్మతు

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామం పంచాయతీ పరిధిలోని రాజేశ్వరరావు పల్లెలో ఇటీవల పైపులైను పగిలిపోవడంతో గ్రామస్తులకు స్వల్పంగా నీటి సమస్య ఏర్పడింది. గ్రామస్తుల నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని సర్పంచి వంశవతి రమేష్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ కొండ తిరుపతి దగ్గరుండి పైపులను మరమ్మతు చేయించి నీటి లీకేజీలు లేకుండా చూశారు. గ్రామంలో పరిశుద్ధ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.



## జీడీకే1అండ్ 3 ఇంక్లైన్‌లో వర్షా కాల ఆరోగ్య అవగాహన కార్యక్రమం

- సీజనల్ వ్యాధుల నివారణ, పరిశుభ్రతపై ఉద్యోగులకు సూచనలు
- వర్షా కాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డా. కారం పద్మ పిలుపు

**పెద్దపల్లి బ్యూరో, జూలై 10(డీడీ9 వార్త):**

రామగుండం ఏరియా1 పరిధిలోని జీడీకే1అండ్ 3 ఇంక్లైన్ గనిలో శుక్రవారం జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వర్షాకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కారం పద్మ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, కలుషిత నీటి వల్ల కలిగే అనారోగ్య సమస్యల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో సురక్షిత విధుల నిర్వహణకు సంబంధించిన భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్ జక్కుల్వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, వెంటిలేషన్ ఆఫీసర్ ఎన్. శ్రీను, పిట్ సెక్రటరీ ఎం. శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. సాయి నిహాల్, వివిధ విభాగాల అధికారులు, సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, జనరల్ షిఫ్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం

- వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బంద్ ప్రశాంతం
- విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరిన ఏఐఎస్ఎఫ్
- ఎన్నికల హామీలను అమలు చేయాలని జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, జూలై 10(డీడీ9 వార్త):**

వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంతో పాటు జీఓ నంబర్ 7, 8, 9లను రద్దు చేయాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇంటర్నెట్ వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు ఉచిత రవాణా, బస్సు పాస్‌లు, మెస్ చార్జీల పెంపు, ర్యాగింగ్ నిరోధక, డ్రగ్స్ నిరోధక కమిటీల ఏర్పాటు, విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విద్యా హామీలైన విద్యా భరోసా కార్డులు, ఉచిత ల్యాప్‌టాప్‌లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల బంద్‌కు సహకరించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, రేణుకుంట్ల ప్రీతం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తడిగొప్పుల అనుప్ సాయి, అభిషేక్, గణేష్, అమరేందర్, రాహుల్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా ఎన్నికైన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లును సన్మానించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమల రఘు, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్

**మంగపేట జూలై 10డీడీ 9 వార్త**

మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన చెట్టుపల్లి వెంకటేశ్వర్లును జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమల రఘు, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేయాలని, అలాగే మంత్రి సీతక్క నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యూరి యానయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు మురుకుట్ల నరేందర్, నరసింహ సాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ, కొమరం సారయ్య, కొమరం బిక్షపతి, ఎటురునాగారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల సాధనకై ఐక్యంగా ఉద్యమిద్దాం

- **సామా బుచ్చిరెడ్డి టీ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి**

**మంగపేట జూలై 10డీడీ 9 వార్త**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారం కోసమే ఐక్యంగా ఉద్యమిద్దమని టిడబ్ల్యూజేఎఫ్ ములుగు జిల్లా కార్యదర్శి సామా బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో టిడబ్ల్యూ జేఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుచ్చిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఎందరో రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాల తలరాతలు మార్చిన జర్నలిస్టులు తమ రాతను రాసుకోలేక దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ప్రభుత్వాలు అనేక హామీలను ఇచ్చి నెరవేర్చకుండా పోతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను కూడా అధికారంలోకి రాగానే మరిచిపోతూ పాత్రికేయులను పావుల వాడుకుంటున్నారు. దీనంతటికీ కారణం మనం ఐక్యంగా ఉద్యమించకపోవడమే. ఇప్పటికైనా మన హక్కులు మన హామీల సాధన కోసం పోరాటం ద్వారా సాధించుకుందాం ఈనెల 13న టీ డబ్ల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ల ముందు నిరసన కార్యక్రమాన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం. అదేవిధంగా ఈ నెల 15న హైదరాబాదులో సమాచార భవన్ వద్ద ఓపెన్ ప్రొటెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించదల పెట్టినాము. పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, గణేష్, బోడ ప్రవీణ్ఎల్ పి ముత్యాలు జాగటి చిన్న, రవి తదితరులు పాల్గొన్నారు



## ఆపదలో ఉన్నవారికి ముఖ్య జంపన్న భరోసా...

- **బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుని కుటుంబానికి పరామర్శించి ఆర్థిక సహాయం ఎల్లప్పుడూ అండగా ఉంటాం – భూక్య జంపన్న**

**ములుగు, డీ డీ 9 వార్త,**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రాంనగర్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు జన్ను సుధాకర్ తల్లి కీ.శే. జన్ను లక్ష్మీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న వారి నివాసానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం జన్ను సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన భూక్య జంపన్న, వారి కుటుంబనికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ ఉద్యమకారులు, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి, భవిష్యత్తులో కూడా అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లకావత్ నరసింహ నాయక్,రామ్ నగర్ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, దుంపలగూడెం సర్పంచ్ సీతారాం నాయక్, బాలాజీ నగర్ సర్పంచ్ మాలోతు గాంధీ, సీనియర్ నాయకులు కృష్ణారావు, అజ్మీర సమ్మయ్య,భగవత్, సారయ్యమండల మాజీ యూత్ అధ్యక్షుడు జన్ను రాంబాబు,కొంపెల్లి రవీందర్, వార్డ్ నెంబర్ మౌనిక చందు, బానోతు రాజు నాయక్, జన్ను ఐలయ్య,దామరాజు రవీందర్, ఆలోత్ ప్రశాంత్, అజ్మీర సుమన్, కిషోర్, మహమ్మద్ అఖిల్ మైనార్టీ నాయకులు, వంశీ, కళ్యాణ్,

బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇసుక లారీల రవాణా నిలిపివేయాలి..

- **రోడ్ల దుస్థితితో ఆర్టీసీ బస్సుల నిలిపివేత ఆలోచన అత్యంత ఆందోళనకరం – సీపీఎం..**

**జూలై10 డిడి9 వార్త వెంకటాపురం.**

మండలంలోని ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్న పరిస్థితిలో, రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు చర్ల ప్రాంతం నుంచి వచ్చే ఇసుక లారీల రవాణాను వెంటనే నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శుక్రవారం చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా చర్ల-వెంకటాపురం ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఇసుక లారీల నిరంతర రాకపోకలతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. వర్షాల కారణంగా గుంతలు నీటితో నిండిపోవడంతో ప్రతిరోజూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పుకునే అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రోడ్ల దుస్థితిపై ఎమ్మెల్యే ఇప్పటికైనా స్పందించి, మరమ్మతులకు నిధుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో వెంకటాపురం మీదుగా ఇసుక లారీలు రానివ్వబోమన్న హామీ ఎందుకు అమలు కాలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

ఇప్పటికే దెబ్బతిన్న రహదారులపై వేల సంఖ్యలో ఇసుక లారీలను నడపడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని మండిపడ్డారు. ఆర్&బీ శాఖ అధికారులు సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్ల దుస్థితి కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గర్భిణీలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే



పరిస్థితి కొనసాగితే భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేసే పరిస్థితి ఏర్పడటం అత్యంత దురదృష్టకరమన్నారు.

ప్రజల ప్రాణాల కంటే ఇసుక రవాణాకు ప్రాధాన్యత ఇవ్వొద్దని ప్రభుత్వానికి హెచ్చరిస్తూ, రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇసుక లారీల రవాణాను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఇసుక లారీలను అడ్డుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శీను, మండల కమిటీ సభ్యులు కంఠం సత్యం, గుండమల్ల ప్రసాద్, బోగట విజయకుమార్, సాధన, పెల్లి దేవి, సుహాసిని, మాణిక్యం, కట్ట మహేశ్వరరావు, సత్యవతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ జన్మదిన వేడుకలు నిర్వహించిన ... యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడిశా ఆదినారాయణ..

**మంగపేట జూలై 10డీడీ 9 వార్త**

పుట్టినరోజు జరుపుకుంటున్న ములుగు జిల్లా యువజన కాంగ్రెస్ రధ సారధి యువ నాయకుడు ఇస్సార్ ఖాన్ జన్మదిన సందర్భంగా మంగపేట మండల కేంద్రం లోని వైస్సార్ విగ్రహం వద్ద మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బడిశా ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిధిగా విచ్చేసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ & మాజీ జడ్పీటీసీ పెద్దలు ఆక రాధాకృష్ణ విచ్చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

యువత పైన నే దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది కాంగ్రెస్ పార్టీ లో యువత కు అన్ని విధాలుగా అండగా ఉంటుంది అని ప్రజా ప్రభుత్వం లో ప్రవేశ పెడుతున్నా సంక్షేమ పధకాలు ప్రజలకు చేర్చేవిదంగా యూత్ కాంగ్రెస్ కృషి చేయాలి అని తెలియజేస్తూ కష్టపడే ప్రతి ఒక్కరిని కాపాడుకునే బాధ్యత మన ఆడబిడ్డ మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షులు అశోక్ అని యువత నే దేశ భవిష్యత్తు అని ఆయన తెలిపారు,అదేవిధంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలం లోని కస్తూర్బ వృద్ధాశ్రమం లో అన్న దాన కార్యక్రమం చేసి ఫ్రూట్స్ పంపిని చేశారు ఈ కార్యక్రమం లో.. జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, జిల్లా sc, st అట్రాసిటీ మెంబర్ మురుకుట్ల నరేందర్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్సం రమేష్, తిరుపతి,యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నూతనకంటి రాజు, గద్దల సాయి, గార్ల తో పాటుగా జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుని కుటుంబానికి పరామర్శించి ఆర్థిక సహాయం ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- **భూక్య జంపన్న**

**మంగపేట జూలై 10డీడీ 9 వార్త**

గోవిందరావుపేట మండలం రాంనగర్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు జన్ను సుధాకర్ తల్లి కీ.శే. జన్ను లక్ష్మీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న వారి నివాసానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం జన్ను సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన భూక్య జంపన్న, వారి కుటుంబనికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ ఉద్యమకారులు, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి, భవిష్యత్తులో కూడా అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లకావత్ నరసింహ నాయక్,రామ్ నగర్ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, దుంపలగూడెం సర్పంచ్ సీతారాం నాయక్, బాలాజీ నగర్ సర్పంచ్ మాలోతు గాంధీ, సీనియర్ నాయకులు కృష్ణారావు, అజ్మీర సమ్మయ్య,భగవత్, సారయ్యమండల మాజీ యూత్ అధ్యక్షుడు జన్ను రాంబాబు,కొంపెల్లి రవీందర్, వార్డ్ నెంబర్ మౌనిక చందు, బానోతు రాజు నాయక్, జన్ను ఐలయ్య,దామరాజు రవీందర్, ఆలోత్ ప్రశాంత్, అజ్మీర సుమన్, కిషోర్, మహమ్మద్ అఖిల్ మైనార్టీ నాయకులు, వంశీ, కళ్యాణ్,

బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు





## అతివేగమే ప్రాణాంతకం

- **వేగ నియంత్రణతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట..**
- **ఇసుక లారీ డ్రైవర్లకు వెంకటాపురం పోలీసుల హెచ్చరిక..**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్సై కే. తిరుపతిరావు..**

**జూలై10 డిడి 9 వార్త వెంకటాపురం.**

రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో వెంకటాపురం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఇసుక లారీ డ్రైవర్లకు ప్రత్యేక రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. తిరుపతి రావు మాట్లాడుతూ, అతివేగం ఒక్క క్షణంలోనే కుటుంబాలను విషాదంలోకి నెట్టివేస్తుందని అన్నారు. ఇసుక లారీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నిర్ణయించిన వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని సూచించారు. నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు ఈచలాన్లు విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 10 మంది డ్రైవర్లకు ఈచలాన్లు జారీ చేసి మొత్తం రూ.2,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

"Arrive Alive - సురక్షితంగా బయలుదేరండి... సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోండి" అనే సందేశాన్ని ప్రతి డ్రైవర్ జీవిత సూత్రంగా తీసుకోవాలని, వేగం కంటే ప్రాణాలే విలువైనవని ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు భద్రతలో ప్రతి వాహనదారుడి బాధ్యత ఎంతో కీలకమని, ప్రజల ప్రాణాల రక్షణ కోసం ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీసులు చేపట్టే తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

## బెల్ట్ షాపులు, సారా రహిత వెంకటాపురమే లక్ష్యం..

- **గుడి,బడి లేకుండా బెల్ట్ షాపులు..**
- **వెంకటాపురం ఎస్ఐకి ఐద్వా వినతి.. మహిళల భద్రత కోసం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్..**

**జూలై10 డిడి 9 వార్త వెంకటాపురం.**

మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా జరుగుతున్న నాటు సారా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టడంతో పాటు బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావుకు ఐద్వా నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు సాధన పెల్లి దేవి మాట్లాడుతూ, గ్రామాల్లో నాటు సారా, బెల్ట్ షాపుల కారణంగా అనేక పేద కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా కుదేలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసైన కొందరు మహిళలపై గృహహింస, దాడులు, వేధింపులకు పాల్పడుతున్నారని, దీంతో మహిళల జీవితం అభద్రతలో పడుతోందని అన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి సందులో గుడి, బడి అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయని, దీనివల్ల మహిళలు, విద్యార్థినులు రోడ్లపై స్వేచ్ఛగా సంచరించడానికి కూడా భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. నాటు సారా తయారీదారులు, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని పోలీసు, ఎక్సైజ్ శాఖలను కోరారు. ఐద్వా ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన మహిళలను చైతన్యపరుస్తూ, పోలీసు-ఎక్సైజ్ శాఖల సమన్వయంతో సారా రహిత మండలంగా వెంకటాపురాన్ని తీర్చిదిద్దేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మజ్జ సుహాసిని, సినిగిరి సత్యవతి, మడకం పుష్ప, మడకం తిరుపతమ్మ, మడకం దేవి, సమ్మక్క, శ్యామల కేత, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# విద్యారంగ సమస్యలపై విద్యార్థి సంఘాల సమరశంఖం

- **ప్రభుత్వ పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి**
- **నిరసన తెలిపిన పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు**

**భద్రాచలం , జూలై 10 , డిడి9 వార్త**

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి సంఘాలైన పీడీఎస్యు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్యు జిల్లా కార్యదర్శి మునిగెల శివ ప్రతాప్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్‌లు మాట్లాడుతూ 27వేల ప్రభుత్వ పాఠశాలలు, 4వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను వెంటనే మానుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యకు తగిన బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, అన్ని ఖాళీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, మధ్యాహ్నం భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ వంటివి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన



సదుపాయాలు కల్పించాలని కోరారు. పీడీఎస్యు డివిజన్ అధ్యక్షులు దండుగుల రామ్ చరణ్ తోట నరేందర్, అనంత రాములు, కారం జయరాజు, పాయం చరణ్. ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్ ,ఆంబోజు, అజయ్ కుమార్, భరత్ ,ఉదయ్ కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

# ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో రూ.1009.15 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

- **సభలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సహచర ఎమ్మెల్యేలు, ఎంపీలు..**

**మణుగూరు.జూలై 10(డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ & గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.1,009.15 కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో విడుదల చేశారు. దీంతో 2026 వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా నిధుల విడుదల రాష్ట్రవ్యాప్తంగా పూర్తయింది.
అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, కార్మికులు, నిరుపేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరించారు. ఇచ్చిన హామీలను దశలవా



రీగా అమలు చేస్తూ రైతు సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో ఎంబాపె విశ్వరూపం.. చరిత్రాత్మక రికార్డులతో సరికొత్త చరిత్ర!

- **అత్యంత పిన్న వయస్కుడిగా 20 మ్యాచ్‌లు**
- **వేగంగా 20 వరల్డ్ కప్ గోల్స్**
- **మెస్సి రికార్డుకు ఒక్క గోల్ దూరంలో ఎంబాపె**
- **నాకౌట్ దశలో అత్యధిక గోల్స్ సాధించిన స్టార్ ఫుట్‌బాలర్**
- **సెమీఫైనల్లో అడుగుపెట్టిన ఫ్రాన్స్**

**డీడీ9 వార్త:**

ఫ్రాన్స్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు కిలియన్ ఎంబాపె ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు. ఫిఫా వరల్డ్ కప్ 2026లో భాగంగా బోస్టన్ స్టేడియంలో మొరాకోతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎంబాపె చరిత్రాత్మక మైలురాళ్లను అందుకున్నాడు. అత్యంత పిన్న వయసులోనే (27 ఏళ్లు) 20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా నిలవడంతో పాటు, అత్యంత వేగంగా 20 వరల్డ్ కప్ గోల్స్ చేసిన క్రీడాకారుడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అతడి అద్భుత ప్రదర్శనతో ఫ్రాన్స్ 20 తేడాతో మొరాకోను ఓడించి వరల్డ్ కప్‌లో వరుసగా మూడోసారి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.
ఈ మ్యాచ్ మొదటి అర్ధభాగంలో లభించిన పెనాల్టీని ఎంబాపె మిస్ చేసినప్పటికీ, పట్టువదలకుండా 60వ నిమిషంలో ఒక మెరుపు గోల్ చేశాడు. ఆ తర్వాత తన సహచర ఆటగాడు ఉస్మాన్ డెంబెలేకు మరో గోల్ చేయడానికి అద్భుతమైన పాస్ అందించాడు. ప్రస్తుతం జరుగుతున్న టోర్నమెంట్‌లో ఎంబాపెకి ఇది 8వ గోల్. దీనితో మూడు వరల్డ్ కప్ ఎడిషన్లలో (2018, 2022, 2026) కలిపి అతడి మొత్తం గోల్స్ సంఖ్య 20కి చేరింది. వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి (21 గోల్స్) రికార్డును సమం చేయడానికి ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు.
ఈ మ్యాచ్‌తో ఫ్రాన్స్ తరపున అత్యధిక వరల్డ్ కప్ మ్యాచ్‌లు (20) ఆడిన ప్లేయర్‌గా హ్యూగో లోరిస్ రికార్డును ఎంబాపె సమం చేశాడు. అలాగే వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు (17) అందుకున్న ఆటగాడిగా జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్ రికార్డును కూడా అందుకున్నాడు. ఈ జాబితాలో లియోనెల్ మెస్సి (20 విజయాలు) మాత్రమే అతడి కంటే ముందున్నాడు. ఇది కాకుండా, వరల్డ్ కప్ నాకౌట్ దశలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో రికార్డును ఇదివరకే అధిగమించిన ఎంబాపె.. మొరాకోపై చేసిన గోల్‌తో ఆ సంఖ్యను 12కు పెంచుకుని అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కెరీర్ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న ఎంబాపె సెమీఫైనల్లోనూ ఇదే జోరు కొనసాగించాలని ఫ్రాన్స్ అభిమానులు ఆశిస్తున్నారు.





# మణుగూరు కల్వకుంట్ల కవిత బాయి బాట కార్యక్రమం..

- **సింగరేణి కార్మికులకు మద్దతు ప్రకటించిన కవితక్క.**

**మణుగూరు. జూలై 10(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని సింగరేణి ఏరియా లలో శుక్రవారం నాడు తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత పర్యటించారు. అందులో భాగంగా పికె ఓసీ 2 గని వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ..OC 2 గని ప్రైవేటీకరణ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ,కార్మికుల హక్కులు మరియు ఉపాధి రక్షణ కోసం అవసరమైతే ఉద్యమం చేపడతామని అన్నారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల పరిరక్షణలో తెలంగాణ రక్షణ సమితి అండగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు.గనులలో కష్టించి పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు అందడం లేదని ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అనంతరం స్థానిక జీఎం ఆఫీసు ఎదురుగా గత పదిరోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సింగరేణి అధికారులకు సంఘీభావం తెలిపారు.మణుగూరు మనుగడకై సింగరేణి ఓసీ 2 డిప్ సైడ్ బ్లాక్ ను ఎలాంటి వేలంపాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కవిత తో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు సింగరేణి కార్మికులు,అధికారులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన పెద్దబీరవల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు

- **జెండా ఊపి బస్సులను ప్రారంభించిన నాయకులు**

**బోనకల్,జులై 10,(డీడీ9 వార్త):**

చింతకాని మండలంలోని మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రులు విచ్చేయుచున్న సందర్భంగా సభలో పాల్గొనేందుకు పెద్దబీరవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సభ స్థలానికి అన్ని ఏర్పాట్లు చేసి కాంగ్రెస్ నాయకులను,కార్యకర్తలను పెద్ద ఎత్తున తరలించడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,మహిళలు అభిమానులు సానుభూతిపరులు పాల్గొన్నారు.



# సిపిఎస్ రద్దు – ఓపీఎస్ పునరుద్ధరణకు జనజాగరణ యాత్రకు మద్దతు

- **వాజేడులో గోడ పత్రిక ఆవిష్కరణ**
- **జూలై 28న ములుగుకు చేరనున్న యాత్ర**

**వాజేడు, జూలై 10 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న జనజాగరణ యాత్రకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం వాజేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఆనందరావు కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా "సిపిఎస్ వద్దు - ఓపీఎస్ ముద్దు" అనే నినాదంతో చేపడుతున్న రాష్ట్రవ్యాప్త జనజాగరణ యాత్రకు పీఆర్టీయూ-తెలంగాణ సంఘం నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల మీదుగా కొనసాగుతున్న జనజాగరణ యాత్ర జూలై 28న సాయంత్రం 5 గంటలకు ములుగు జిల్లాకు చేరుకుంటుందని, ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు అన్నవరం రవికాంత్, రాష్ట్ర కార్యదర్శి గుల్లగట్టు సంజీవ్, పీఆర్టీయూ-తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం, వాజేడు మండల అధ్యక్షులు పోరిక స్వరూప్ సింగ్‌తో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# హెల్మెట్ ధరిస్తే శాలువాతో సన్మానం

- **'Arrive Alive' కార్యక్రమంతో రోడ్డు భద్రతపై ములుగు పోలీసుల ప్రత్యేక అవగాహన**
- **ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి**
- **ములుగు డిఎస్పి రవీందర్**
- **వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు**

**ములుగు, జూలై 10 డీ డీ 9వార్త :**

రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ములుగు జిల్లా పోలీసులు చేపట్టిన "Arrive Alive - రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం" విశేష స్పందన పొందింది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాలు, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో శుక్రవారం వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్ నగర్ టోల్ ప్లాజా వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ, ములుగు సీఐ, వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించాలని, కారులో డ్రైవర్‌తో పాటు ప్రతి ప్రయాణికుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.
అదేవిధంగా ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, పాదచారులు జీబ్రా క్రాసింగ్ ద్వారానే రహదారిని దాటాలని సూచించారు. ప్రయాణానికి ముందు వాహనంలోని బ్రేకులు, లైట్లు, ఇతర భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని తెలిపారు.కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను పోలీసులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని వివరించారు. "వేగం కాదు... ప్రాణమే ముఖ్యం - సురక్షితంగా వెళ్లండి... సురక్షితంగా చేరుకోండి (Arrive Alive)" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.